క్లుప్తంగా

ఆర్సీఎం స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: కొరిటెపాడులోని ఆర్సీఎం పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎద్దుల అనిల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రఘు ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ రఘురామ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యాజమాన్యం నూతన వస్త్రాలను బహూకరించింది. ఎమ్మెల్సీ లక్ష్మణరావు విద్యార్థుల మేధకు పదును పెట్టే విధంగా ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో న్యాయవాది అనూరాధ, వెంకాయమ్మ, సామ్రాజ్యం పాల్గొన్నారు.

శివాజీని పరామర్శించిన ఎమ్మెల్యే గౌతు శిరీష



గుంటూరు ఎడ్యుకేషన్: అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శించారు. శనివారం బృందావన్‌గార్డెన్స్‌లోని శివాజీ నివాసానికి వచ్చిన ఆమె ఆయన యోగక్షేమాలను విచారించారు. తన తండ్రి గౌతు శ్యామ్‌సుందర్ శివాజీతో ఉన్న అనుబంధం, వారిరువురూ కలిసి రైతుల సంక్షేమం కోసం చేసిన కృషిని గురించి ఈసందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. శివాజీని పరామర్శించిన వారిలో బొల్లేపల్లి సత్యనారాయణ, జొన్నలగడ్డ రామారావు, రావెల సాంబశివరావు, దాసరి హనుమంతరావు, అత్తోట సుబ్బారావు ఉన్నారు.

అబాకస్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: చదువుతోపాటు ప్రతిభా పాటవ పోటీల్లో మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని పాఠశాల చైర్మన్ కేవీ సెబాస్టియన్ తెలిపారు. లక్ష్మీపురంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14,15వ తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో 30 దేశాలకు చెందిన ఆరువేల మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వీరిలో తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని గోళ్ల చంద్రిక, ఒకటో తరగతి విద్యార్థి గోళ్ల శ్రీ షణ్మిత్ దేవాన్ష్ మూడో రన్నరప్‌గా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంపాలెం సీఐగా నజీర్ బేగ్



లక్ష్మీపురం: నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నజీర్ బేగ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పలు కారణాల నేపథ్యంలో వీరా నాయక్‌ను పోలీస్ ఉన్నతాధికారులు వీఆర్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నజీర్ బేగ్ 2009 బ్యాచ్ ఎస్‌ఐగా పోలీస్ శాఖలో బాధ్యతలు చేపట్టి సత్తెనపల్లి టౌన్, రూరల్, ముప్పాళ్ల, బొల్లాపల్లి ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో సీఐగా పదోన్నతి పొంది రేపల్లెలో లా అండ్ ఆర్డర్ సీఐగా పనిచేశారు.

గణితంలో పట్టుతో మేధావులుగా రాణింపు



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో గణిత శాస్త్రంలోని ప్రాథమిక అంశాలైన లెక్కలు, కూడికలు, తీసివేతలు, భాగాహారాలపై పట్టు సాధించడం ద్వారా పూర్తి జ్ఞాపకశక్తితో మిగితా సబ్జెక్టులపై అవగాహన కలిగి, మేధావులుగా రాణిస్తారని ప్రజ్ఞ స్కూల్ ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు తెలిపారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్లో శనివారం భారతీయ గణిత మేధావి డాక్టర్ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు స్పీడ్ మాథమాటిక్స్‌పై పరీక్ష నిర్వహించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీమాన్, సలీం, మస్తాన్‌రావు, సుధారాణి, జరీనా, సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో రక్తదానం, కేక్ కటింగ్
- హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు



పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్ బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్, నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ నేత మేకతోటి దయాసాగర్ ముఖ్యఅతిథులుగా హాజరై కేక్‌ను కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారు ఉన్న ప్రతి చోట వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదే విధంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు అండగా నిలబడ్డారని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో రక్తం అనేది ఎంతో అవసరమని, తమ నేతపై ఉన్న అభిమానంతో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చాయని అనుకోవటం పొరపాటేనని, 40శాతం ఓట్లు మనకు ఉన్నాయని, ఎనలేని ప్రజాభిమానం వైఎస్సార్ సీపీ సొంతమని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ పుట్టిన రోజు నాడున ప్రతి ఒక్కరం ఐక్యతగా ముందుకు సాగుతామని ప్రతినబూనాలన్నారు. పార్టీ గుంటూరు, నర్సరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగులు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ఒక పుణ్య కార్యమన్నారు. వైఎస్ జగన్ జన్మదినాన్ని వేడుకలు నిర్వహించటమే కాకుండా, తిరిగి ఆయన్ని సీఎంని చేసుకుని గిఫ్టుగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. నిత్యం కార్యకర్తల వెంటుండి నడిచే నేతగా, రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏ ఒక్కరికి దక్కని ప్రజాదరణ వైఎస్ జగన్ సొంతమన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే వైఎస్ జగన్ పది కాలాల పాటు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ప్రజా సంక్షేమమమే ధ్యేయంగా ముందుకు సాగిన ఘనతన వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పాలనలో అభివృద్ధి, సంక్షేమం అంటే ఎలా ఉండాలో చేసి చూపెట్టారన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కడిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి, రాష్ట్రంలోనే వైఎస్సార్ సీపీ ఎదురులేని పార్టీగా తీర్చిదిద్దిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మంచికి, ధైర్యానికి, సాహసానికి ప్రతిరూపం వైఎస్ జగన్ అని తెలిపారు. డిప్యూటీ మేయర్, పార్టీ నగర అధ్యక్షుడు డైమండ్‌బాబు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు తన పాలనలో మేలు చేసిన గొప్ప వ్యక్తి వైఎస్ జగనన్న అని తెలిపారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ అనుక్షణం పేదలకు మంచి చేయాలని పరితపించే గొప్ప మనస్తత్వం, కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా కాపాడుకునే గుణం ఆయనదని అభినందించారు. వైఎస్సార్ సీపీ నేతలు, రాష్ట్ర, జిల్లా, నగర కమిటీ నేతలు పాల్గొన్నారు.

పేదవాడి గుండె చప్పుడు వైఎస్ జగన్



జిరాక్స్ మిషన్ పంపిణీ చేస్తున్న అంబటి, నూరిఫాతిమా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదవాడి గుండె చప్పుడు అని పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. జననేత వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం తూర్పు నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వేడుకల్లో నియోజకవర్గ పరిధిలోని నందివెలుగు రోడ్డు గాంధీబొమ్మ సెంటర్, ఓల్డ్ క్లబ్‌రోడ్ వైఎస్సార్ బొమ్మ, పొన్నూరు రోడ్డు, జెండా చెట్టు సెంటర్‌లో కేక్ కట్ చేశారు. తొలుత పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు ప్రాంతాల్లో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ అనుక్షణం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్ పాటుపడుతున్నారన్నారు. కచ్చితంగా రానున్న రోజుల్లో తిరిగి ముఖ్యమంత్రి కావటం తథ్యమని, ప్రజలకు మంచి జరుగుతుందని స్పష్టం చేశారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ అనేక ఒడిదుడుకులు.. అనేక కష్టాలు.. ఇబ్బందులు ఎదుర్కొని... మొక్కవోని ధైర్యంతో తానేంటో నిరూపించిన ఘనత వైఎస్ జగనన్నకే దక్కుతోందన్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు, కుట్టుమిషన్లు, జిరాక్స్ మిషన్‌లు, పండ్లు పంపిణీ, తోపుడు బండ్లను అందజేశారు.

సంక్షేమానికి దిక్సూచి వైఎస్ జగన్

నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు



పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ అందించలేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజల పక్షపాతిగా నిలిచారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు చెప్పారు. శనివారం మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సంపత్ నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి, పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సంక్షేమ పాలనకు చిరునామాగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో పరిపాలన అందించారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి వారి ఇంటి వద్దకే అందించారన్నారు. అవ్వ, తాతలకు పెన్షన్ పెంపు, ప్రజారోగ్యం కోసం కృషి చేసే కార్మికులకు జీతాల పెంపు చేసి తాను కార్మికుల పక్షపాతినని చాటుకున్నారని చెప్పారు. కరోనా వంటి విపత్కర సమయంలో కూడా ఏ సంక్షేమ పథకం నిలుపుదల చేయకుండా ప్రతి ఒక్కరికి పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 20వ డివిజన్ అధ్యక్షులు కంతేటి శ్యాం శేకర్, ఖాజా మొహిద్దీన్, నరసరెడ్డి, రవిశంకర్, వాసు, జెట్టి మురళి, రామరాజు, నాగిరెడ్డి, శివా రెడ్డి, నాయక్, నాగూర్, కరీం, కానుకల శివ, పల్లపు దుర్గాప్రసాద్, బాషా, కవిత, ఫాతిమా తదితరు పాల్గొన్నారు.

బంగారం తాకట్టు పెట్టి మోసం చేసిన వారిపై కేసు

లక్ష్మీపురం: బంగారం బ్యాంకులో తాకట్టులో ఉండగా వాటిని విడిపించి వేరే బ్యాంకులో మరలా తాకట్టు పెట్టి పెద్ద మొత్తంలో లోన్ ఇప్పిస్తామని చెప్పి మహిళను ఇద్దరు వ్యక్తులు మోసం చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టాభిపురం సాయినగర్‌కు చెందిన మాకినేని అనిత, భర్త శ్రీనివాసరావుకు చెందిన బంగారం నగలు బ్యాంకులో తాకట్టులో ఉన్నాయి. వాటిని బ్రాడీపేటకు చెందిన కోటేశ్వరరావు, రాజశేఖర్‌రెడ్డి బ్యాంకులో నుంచి విడిపించి వేరే బ్యాంకులో పెట్టి పెద్ద మొత్తంలో లోన్ ఇప్పిస్తామని చెప్పారు. దీంతో ఆ ఇద్దరు వ్యక్తులు 2022లో బంగారం తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి వారి వద్దనే ఉంచుకుని తిరిగి ఇవ్వకుండా లోన్ ఇప్పించకుండా మోసం చేశారు. అయితే బాధితురాలు రూ.18 లక్షలకు సంబంధించి అవసరమైతే వడ్డీతో సహా చెల్లిస్తానని చెప్పిన కాలయాపన చేస్తున్నారు. దీంతో బాధితురాలుకు దిక్కుతోచక శనివారం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

లక్ష్మీపురం: ప్రజలపై సర్దుబాటు చార్జీల భారాన్ని వేయడాన్ని నిరసిస్తూ పాత గుంటూరు శాఖ ఆధ్వర్యంలో శనివారం గాంధీ బొమ్మ సెంటర్, అంకమ్మ గుడి సెంటర్, మణి హోటల్ సెంటర్లలో మూడు చోట్ల సీపీఎం ఆధ్వర్యంలో కరెంటు బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అరుణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్దుబాటు చార్జీల, పేరుతో భారాలు వేయటం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. దేశ ప్రధాని ఒప్పందాలను రద్దు చేయాలని ప్రజల పైన భారాలు వేయడాన్ని ఆపాలని లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీటర్లు బిగించటాన్ని వ్యతిరేకించండి.. పగలగొట్టండి అని చెప్పినటువంటి వాళ్లే ఈరోజు మీటర్ల బిగించడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. వ్యవసాయం పంపు సెట్లకు, ఆఫీసుల్లో, షాపుల్లో బిగించారని ఇప్పుడు ఇళ్లల్లో బిగించడానికి సిద్ధమయ్యారని వీటిని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమాలు శాఖ కార్యదర్శి ఎస్.కార్తీక్, సీపీఎం నాయకులు కె. గంగాధర రావు, జే నాంచారయ్య, ముతా గంగాధరరావు, మురళీకృష్ణ, జి.రమణ, ఎం.కృష్ణకుమారి, నటరాజ్ పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ప్రయోజనాలు బాలలకు చేర్చాలి

సమగ్రశిక్ష అదనపు ఎస్పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ద్వారా కల్పిస్తున్న ప్రయోజనాలను అర్హులైన బాల, బాలికలకు అందించడంలో క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలని సమగ్రశిక్ష అదనపు ఎస్పీడీ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో శనివారం సమగ్ర శిక్ష సహిత విద్య విభాగ ఆధ్వర్యంలో ఎంఈఓలకు ఒక్కరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సహిత విద్య సమన్వయకర్త అన్నపూర్ణ, డీఈఓ సీవీ రేణుక, సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి, వనజ, షేక్ ఖాసిం పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ విజ్ఞాన్ లారా

ముగిసిన ఆదర్శ్–2024 క్రీడోత్సవాలు



విజ్ఞాన్ లారా కళాశాల టీంకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి, రామకృష్ణమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఆదర్శ్–2024 స్పోర్ట్స్ ఫర్ హార్మనీ' పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన క్రీడోత్సవాల్లో వడ్లమూడిలోని విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. ఈసందర్భంగా శనివారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన హిందూ విద్యా సంస్థల్లో భాగమైన ఇంజినీరింగ్ కళాశాల రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకంగా క్రీడోత్సవాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక వికాసంతో పాటు జాతీయ స్ఫూర్తి, దేశభక్తి అలవాడతాయని చెప్పారు. క్రీడాకారులకు వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు క్రీడాస్ఫూర్తితో మెలగడం నేర్చుకోవాలని సూచించారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం క్రీడాకారులకు ప్రధాన లక్షణంగా ఉండాలని చెప్పారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి వచ్చిన 65 టీంలు వివిధ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. వివిధ విభాగాల్లో 12 టీంలను వివిధ కళాశాలల నుంచి ఎంపిక చేసి విన్నర్స్, రన్నరప్‌లకు రూ.లక్షకు పైగా బహుమతులు అందించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజక్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కె సుస్మిత చౌదరి, ఫిజికల్ డైరెక్టర్ కె.రవి, వెలగా అమ్మయ్య, ఆడిటర్ చింతలపాటి వెంకటరామయ్య డాక్టర్ ఎం.శ్రీధర్, కేఎస్ఆర్, కుటుంబరావు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు పెద్దపీట వేసిన భాష్యం స్టీమ్ ఎక్స్‌పో



సంప్రదాయ వస్త్రధారణలోని విద్యార్థులతో భాష్యం సాకేత్‌రామ్

గుంటూరు ఎడ్యుకేషన్: నూతన బోధనా పద్ధతుల ద్వారా విద్యా విధానంలో సాంకేతికను జోడించి, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు భాష్యం విద్యాసంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయని ప్రముఖ పాథాలజీ వైద్య నిపుణులు డాక్టర్ స్వతంత్ర పేర్కొన్నారు. శనివారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం బ్లూమ్స్ వీబీసీ క్యాంపస్‌లో గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా స్టీమ్ ఎక్స్‌పో పేరుతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వతంత్ర మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రాబోయే ప్రమాదాలను ముందుగానే గుర్తించి, వాటిని నివారించే పద్ధతులను వివరించారు. భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ మాట్లాడుతూ భాష్యం ప్రవేశపెడుతున్న నూతన విద్యా విధానాలను సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈసందర్భంగా ప్రదర్శనలో ఉంచిన ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ జెడ్ఈవో వరలక్ష్మి, సెకండరీ, ప్రైమరీ ప్రిన్సిపాల్స్ గిరిజారాణి, కవిత పాల్గొన్నారు.

సీతారాముల తెప్పోత్సవం



పల్లకీసేవ..



తెప్పోత్సవం దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీశృంగేరీ పీఠ పాలిత శ్రీరామ నామ క్షేత్రంలో శనివారం సీతారామ పరివార తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం శాంతి హోమం, పూర్ణాహుతి, చక్రతీర్థ సంప్రోక్షణతో పాటు శ్రీరామనామ సంకీర్తన గావించారు. పల్లకీసేవ కన్నుల పండువగా సాగింది. రాగం వెంకట లీలా సుందరి, మస్తాన్‌రావు దంపతులు, పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉత్సవాలు ముగియనున్నాయి.

సీతారామయ్య స్కూల్లో ఆకట్టుకున్న ఎడ్యు ఎక్స్‌పో



జాతీయ గణిత దినోత్సవంలో రవికుమార్, విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ గణిత మేధావి డాక్టర్ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శనివారం లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రీ–ప్రైమరీ నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు వివిధ అంశాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్వీఆర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రవికుమార్ ప్రదర్శనను ప్రారంభించారు. ప్రీ–ప్రైమరీ విద్యార్థులు వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలో చిన్నారులు తమ ముద్దు మాటలతో అలరించారు. విద్యా, వైద్య, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక, గణిత అంశాల సమాహారంగా విద్యార్థులతో తయారు చేసిన వందలాది నమూనా ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలకవర్గ ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, కర్లపూడి పార్వతీదేవి, దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

రేపు పెనుగొండ లక్ష్మీనారాయణ అభినందన సభ

లక్ష్మీపురం: అరసం జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అభినందన సభను సోమవారం నిర్వహిస్తున్నట్లు గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు 2/7 బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో అభినందన సభ జరుగుతుందని తెలిపారు. సభలో అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీలు పాల్గొంటారన్నారని తెలిపారు. లక్ష్మీనారాయణ తన జీవితాంతం సమాజ పురోభివృద్ధికి, అభ్యుదయ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి ప్రయత్నించారని, నేటి సామాజిక, ఆర్థిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం అభినందనీయమని తెలిపారు. జరుగనున్న సభలో కవులు, కళాకారులు, సాహితీ ప్రియులు, అభ్యుదయ వాదులు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య

లక్ష్మీపురం: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యసభలో బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అహంకార పూరిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌పై నేరుగా దాడి చేయడానికి ఉద్దేశించిన ఈ మాటలు దేశ ప్రజల్లో తీవ్ర కలవరం సృష్టించినట్లు చెప్పారు. అంబేడ్కర్ కేవలం దళితుల నాయకుడు కాదని, ఎస్సీ,ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాల ఆశాజ్యోతి అనే విషయాన్ని అమిత్‌షా విస్మరించారన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ 75 ఏళ్ళ రాజ్యాంగం పై చర్చ జరుగుతున్న తరుణంలోనే ఈ రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అనంతరం సంస్థ సభ్యులు ప్రసంగించారు.

విజ్ఞాన్ హైస్కూల్లో గణితశాస్త్ర ప్రదర్శన



గణితశాస్త్ర ప్రదర్శన తిలకిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శనివారం ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన గణితశాస్త్ర ప్రదర్శనను పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన త్రీడీ షేప్స్, జామెట్రికల్ ఫిగర్స్, ఫ్రాక్షన్స్, ధర్మాలు, కొలతలు, బరువులు, వైశాల్యం, ఫజిల్స్ తదితర అంశాలు ఆకట్టుకున్నాయి.

గణితంపై పట్టుతో అన్ని శాస్త్రాల్లో రాణించగలరు



ప్రదర్శన తిలకిస్తున్న కృష్ణప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: గణితంపై పట్టుతో సాధించడం ద్వారా మిగిలిన అన్ని శాస్త్రాల్లో రాణించగలరని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో శనివారం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా గణిత శాస్త్రవేత్తల చిత్రాలతో పాటు, గణిత చార్ట్‌లను ప్రదర్శించారు. జేకేసీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కె.సాంబశివరావు మాట్లాడుతూ గణితాన్ని చిరు మెలకువలతో భయం లేకుండా నేర్చుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు గణితశాస్త్రంలో ప్రదర్శించిన వివిధ అంశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య పాల్గొన్నారు.